క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

పెనుగంచిప్రోలు: ఉపాధ్యాయులు విద్యార్థులకు సమర్థంగా నాణ్యమైన బోధన అందించాలని ఎంఈఓ డి.రవీంద్ర అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఈపీ 2020కు అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం టీచింగ్ టూల్స్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, హెచ్‌ఎం కె.జలజ, రిసోర్సు పర్సన్లు పాము నాగేశ్వరరావు, శెట్టిపోగు రాము, ఆరేపల్లి ప్రకాశరావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి చెత్త సేకరణ రిక్షా అందజేత

నందిగామటౌన్: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహకరించాలని సర్పంచ్ బొల్లినేని పద్మజ కోరారు. మండలంలోని లింగాలపాడు గ్రామ పంచాయతీకి గ్రామానికి చెందిన మండడపు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శనివారం చెత్త సేకరణ రిక్షాను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సర్పంచ్ రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణకు రిక్షాను అందించటం అభినందనీయమన్నారు. రిక్షాను అందించిన దాతను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కంచికచర్ల(వీరులపాడు): కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ కంచికచర్లలో వైద్యాధికారులు, సిబ్బంది శనివారం నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే వైద్యులపై హత్యాచారాలకు పాల్పడటం హేయమైన చర్య అని బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైద్యాధికారులు, వైద్యారోగ్య సిబ్బందికి రక్షణ కల్పించటంతో పాటు దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంచికచర్ల, పెండ్యాల పీహెచ్‌సీ వైద్యాధికారులు మధురిమ, జెస్సీ లివింగ్ ఫెయిత్, పవన్ నరేంద్ర వర్మ, స్నేహ, వైద్య సిబ్బంది, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అమ్రిత సాయిలో రక్తదాన శిబిరం



కంచికచర్ల(వీరులపాడు): ప్రాణాపాయ స్థితిలో రక్తం దొరకకపోవటం వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం అన్నిదానాల కన్నా ఉత్తమమైనదని అమ్రితసాయి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రామ్మోహనరావు అన్నారు. కంచికచర్ల మండలంలోని పరిటాల గ్రామ సమీపంలో ఉన్న అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడకు చెందిన లయన్స్ డిస్ట్రిక్ట్ 316డి బ్లడ్ సెంటర్ సౌజన్యంతో కళాశాల విద్యార్థులు రక్తదానం చేయటం సంతోషంగా ఉందన్నారు. మొత్తం 112 యూనిట్‌ల రక్తం సేకరించినట్లు రక్తదాన కేంద్రం నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం అధికారి సాయిరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ గ్యాస్ సిలిండర్ పేలి లారీ డ్రైవర్‌కు గాయాలు

జగ్గయ్యపేట: లారీలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని బూదవాడ గ్రామంలోని ఒక కర్మాగారంలో అన్‌లోడ్ చేసేందుకు లారీ వచ్చింది. మధ్యాహ్న సమయంలో లారీలో వంట చేస్తుండగా మినీ సిలిండర్ ప్రమాదవశాత్తు పేలటంతో డ్రైవర్ శివకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో శనివారం కోతి దాడి చేయడంతో బేతపూడి రోహిణి అనే మహిళ గాయపడింది. తన ఇంటి ఆవరణలో పనులు చేసుకుంటున్న క్రమంలో ఆమెపై కోతి దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆమె కొండపల్లి పీహెచ్‌సీలో చికిత్స చేయించుకుంది. ఇటీవలి కాలంలో కిలేశపురం గ్రామంలో కంతేటి మనోజ్ అనే యువకుడిపై కోతులు దాడి చేశాయి. బాధితుడు ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో నెలరోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. విసన్నపేటలో జరిగిన దాడిలో కూడా బాలుడు తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. గ్రామాల్లో కోతుల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేట ప్రజల దుఃఖదాయని

- అంటువ్యాధులకు నిలయంగా మారిన ఎర్రకాలువ
- 16 ఏళ్ల నుంచి కొలిక్కిరాని సమస్య
- అర్ధంతరంగా ఆగిపోయిన ప్రక్షాళన పనులు
- అధికారుల అలసత్వంతో వెనక్కుపోయిన నిధులు
- దోమలకు ఆవాసంగా మారిన వైనం
- వర్షాకాలం వ్యాధులు ప్రబలుతాయని వణికిపోతున్న ప్రజలు



గుర్రపుడెక్క, వ్యర్థాలతో నిండిపోయిన ఎర్రకాలువ

జగ్గయ్యపేట అర్బన్: ఆ కాలువ పట్టణం నడి బొడ్డున ప్రవహిస్తూ, దుర్గంధం వెదజల్లుతూ దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. పట్టణ ప్రజలకు గత 16 ఏళ్లుగా నరకాన్ని చూపిస్తోంది. వర్షాకాలం వస్తే వ్యాధులను వ్యాపింపజేసే కేంద్రంగా ప్రజలను భయపెడుతోంది. ఆ కాలువ పేరు ఎర్రకాలువ. ఈ కాలువలోని దోమలతో ప్రజలకు రాత్రుళ్లు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఎర్రకాలువ ప్రక్షాళన పనులు పన్నెండేళ్ల క్రితం 2012 లో మొదలై మూడు నెలలకే అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రజల అభీష్టం మేరకు అప్పటి ప్రభుత్వ విప్‌గా ఉన్న ఉదయభాను 2008 లో రూ.2కోట్ల 28లక్షల ఇరిగేషన్ నిధులు ప్రక్షాళనకు మంజూరుచేయించారు. కాని అవి బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. నిధులు మంజూరైతే చేయించారు గాని ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాలతో కాలువ ప్రక్షాళన పనులు ప్రారంభం కాలేదు. తిరిగి మూడేళ్లకు ఎర్రకాల్వ ఆధునీకరణ పనులు మొదలయినప్పటికీ కొన్ని కారణాలతో మూడు నెలలకే నిర్మాణ పనులు ఆపివేసి కంట్రాక్టర్ వెళ్లిపోయాడు. రైతుబజార్ వద్ద నుంచి విజ్ఞాన్ హైస్కూల్ వరకు కిలోమీటరున్నర మేర కాలవను విశాలంగా, ఫ్లోరింగ్ ,సైడ్ వాలింగ్‌తో నిర్మాణం చేస్తూ అర్ధంతరంగా 2012 మే నెలలో పనులను నిలిపివేశారు. దీంతో ఎర్రకాలువ ప్రక్షాళన ప్రశ్నార్థకంగా మారింది. పరిష్కారం కాని ఈ ప్రహసనం మొదలై 16 ఏళ్లు అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా మారింది.

అలసత్వానికి కారణాలనేకం

ప్రక్షాళన పనుల్లో భాగంగా కాల్వ విస్తరణ వల్ల స్థలాలు కోల్పోతున్నామని కొందరు కాల్వకట్ట వాసుల ఫిర్యాదులు, విస్తరణలో వివక్ష చూపిస్తున్నారని కొన్ని ఫిర్యాదులు రావడంతో సమస్య తహసీల్దార్ వరకు వెళ్లింది. అఖిలపక్ష నేతలు మళ్లీ కాల్వ కొలతలపై సర్వే చేయాలని సూచించటంతో సమస్య మొదటికి వచ్చింది. కంట్రాక్టర్ నిర్మాణ పనులను ఆపివేశాడు. మంజూరైన నిధుల్లో కొంతమేర ఖర్చుకాగా, రూ.కోటి 28 లక్షల నిధులు వెనక్కు వెళ్లిపోయాయి.

అధికారులలో కొరవడిన చిత్తశుద్ధి

లక్ష్యసాధనలో అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడటంతో ఎర్రకాల్వ ప్రక్షాళన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కిందిస్థాయి అధికారుల నుంచి డివిజనల్ ఇంజినీర్ల వరకు నిర్లక్ష్య వైఖరి మూలంగా ఇప్పటివరకు 600 మీటర్ల మేర మాత్రమే కాల్వ ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. కంట్రాక్టర్‌కు చెల్లించవలసిన బిల్లుల విషయంలో కూడా అదే వైఖరి అనుసరించడంతో కంట్రాక్టర్ అప్పటి నుంచి అడ్రస్ లేకుండా పోయాడు. దీంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయి కాలువ పరిస్థితి గతం కంటే దారుణంగా తయారయింది. మురికినీరంతా ముందుకు ప్రవహించకుండా ఆగిపోయి కంపు కొడుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని వెనక్కు పోయిన నిధులతో పాటు అదనపు నిధులు మంజూరు చేయించి ఆగిపోయిన ఎర్రకాల్వ ప్రక్షాళన పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

దోమల బాధ భరించలేక పోతున్నాం



కాలువ నిర్మాణపనులు మధ్యలో ఆగిపోవడం వలన పైనుంచి వచ్చే మురికి నీరంతా నిలిచిపోయి భరించలేని కంపు కొడుతోంది. గుర్రపుడెక్కతో నిండిపోయినప్పటికీ దానిని తొలగించడం లేదు. దోమలు వృద్ధి చెంది రాత్రుళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తరచూ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి.

– ఊర్ల భాస్కరరావు, కాలువ కట్టవాసి

కాలువలో వ్యర్థాలను పడవేయడం వలనే సమస్య



ఎర్రకాలువ మురికి కూపంలా తయారు కావడానికి ప్రధాన కారణం పరిసర ప్రాంత ప్రజలే. చాలా మంది తమ గృహాల నుంచి వెలువడే చెత్త, తదితర వ్యర్థాలను ఎర్రకాలువలో పడవేస్తున్నారు. దీంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డుపడి మురుగునీరు ముందుకు కదలకుండా నిలిచిపోతోంది.

–సీహెచ్ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, జగ్గయ్యపేట

నందిగామ, చందర్లపాడు ఎస్‌ఐల బదిలీలు

నందిగామటౌన్: నందిగామ, చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐలు శనివారం బదిలీ అయ్యారు. నందిగామ-1 ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మోర్ల దుర్గామహేశ్వరరావును చందర్లపాడు ఎస్‌ఐగా బదిలీ చేయగా ఎస్‌ఐ-2గా పని చేస్తున్న పండుదొరను నున్న పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బదిలీ చేశారు. చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఇప్పటివరకు ఎస్‌ఐగా పని చేసిన ధర్మరాజు గుణదల పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నందిగామలో ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేసిన ప్రభుత్వం వారి స్థానంలో ఎవరినీ ఇంకా నియమించలేదు. నందిగామ ట్రాఫిక్ ఎస్‌ఐగా పని చేస్తున్న విజయ్‌కుమార్‌ను బదిలీ చేయటంతో ఆయన స్థానంలో నరేష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

కంచికచర్ల ఎస్‌ఐలుగా రాజు, నాగకళ్యాణి

కంచికచర్ల(వీరులపాడు): కంచికచర్ల ఎస్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను ఏలూరు రేంజ్‌కు సరెండర్ కావాలని ఆదేశాలు రావటంతో ఆయన స్థానంలో బోనగిరి రాజు వీఆర్ నుంచి కంచికచర్లకు బదిలీపై వచ్చారు. మహిళా ఎస్‌ఐగా పి.నాగకళ్యాణి కూడా వీఆర్ నుంచి కంచికచర్లకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ మహిళా ఎస్‌ఐగా పని చేసిన హైమావతి విజయవాడ నగరంలోని మాచవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

వత్సవాయి ఎస్‌ఐగా ఉమామహేశ్వరరావు



వత్సవాయి: మండల ఎస్‌ఐగా సి.ఉమామహేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన పి.అభిమన్యు విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఉమామహేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు.

వీరులపాడు ఎస్‌ఐగా అనిల్

వీరులపాడు: వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అనిల్ వీరులపాడు ఎస్‌ఐగా బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఎస్‌ఐగా అనిల్ బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

కోల్‌కతా ఘటనకు నిరసనగా ప్రభుత్వ వైద్యుల ర్యాలీ



పేటలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది, స్థానిక వాగ్దేవి నర్సింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేయడం దారుణం అన్నారు. మహిళలపై అత్యాచారాల నివారణకు ప్రభుత్వాలు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ అత్యాచారాలు తగ్గకపోవడం విచారకరమన్నారు. మానవత్వానికి మాయని మచ్చలా జరిగిన ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్లు పవన్‌కుమార్, రాజ్‌కుమార్, అరుణ, లక్ష్మీప్రసన్న, యూపీహెచ్‌సీ డాక్టర్లు అనూష, షైల, పీపీ యూనిట్ డాక్టర్లు నాగరాణి, వాసంతి, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ బుస్సా సురేష్, ఫ్యాకల్టీ ఈశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

వీరులపాడు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని ఎస్‌ఈబీ సీఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామ శివారులోని అక్షర కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం-నష్టాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అందుకు విద్యార్థులు సహకరించాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు, ఇంటర్‌నెట్‌లో చెడు ఎక్కువగా ఉండే వెబ్‌సైట్‌లకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తు పౌరులని దేశ ప్రగతిలో వారు భాగస్వాములు కావాలని సూచించారు. మత్తు పదార్థాలు తీసుకోవటం వల్ల జ్ఞాపకశక్తి క్షీణిస్తుందని, అటువంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించి, నలుగురికీ స్ఫూర్తిగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కళ్యాణి, నరేంద్ర కృష్ణ, గౌరవాధ్యక్షుడు కాసరగడ్డ రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆదివారం ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేయనున్నట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రారంభిస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గమ్మకు నృత్యాంజలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు చెన్నైకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి ఘటించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ప్రతి రోజూ నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణులు భరతనాట్యంతో భక్తులను అలరించారు. మైత్రి సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ (చెన్నై) సంస్థకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి అంశంతో ప్రారంభించి 'శివోహం', 'ఆనంద నటన ప్రకాశం', 'గోవిందం', 'దేవి - మాతృ సమర్పణం' అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నర్తించారు. వారి అద్భుత నాట్యంతో భక్తులు తన్మయులై హర్షధ్వానాలు చేశారు.

భూములు లాక్కుంటే సహించం

జి.కొండూరు: ఐదు దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం లాక్కుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని కోడూరు గ్రామానికి చెందిన మామిడి రైతులు అన్నారు. వివరాలలోకి వెళ్తే...కోడూరు గ్రామ పరిధిలో ఉన్న 120 ఎకరాల రెవెన్యూ పోరంబోకు భూమిని అదే గ్రామానికి చెందిన బడుగు, బలహీన వర్గాల రైతులు గత 50 ఏళ్లుగా మామిడి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు ఆర్డీఓ ఆదేశాల మేరకు తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఇటీవల పరిశీలించారు. నర్సరీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకునేందుకు పావులు కదుపుతోందని అనుమానం రావడంతో ఆ భూమిలో మామిడి సాగు చేస్తున్న 60 మంది రైతులు తమ భూములను లాక్కోవద్దంటూ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి శనివారం వినతిపత్రం అందజేశారు.

వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకుల అందజేత



వృద్ధాశ్రమానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న చిరంజీవి యువత సభ్యులు

నందిగామ టౌన్: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని లచ్చపాలెం గ్రామంలో వృద్ధాశ్రమానికి 25 కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను అందించినట్టు అఖిల భారత చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు పోలిశెట్టి వరుణ్ తెలిపారు. వారం రోజుల పాటు పలు రకాలుగా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిరంజీవి యువత సభ్యులు కామిశెట్టి వెంకటేశ్వరరావు, పూజారి రాజేష్, ఆకుల వెంకట్, సింగంశెట్టి శ్రీనివాస్, కొంగర రామకృష్ణ, మధుసూదన్, సతీష్, శ్రీను, నరేంద్ర యోగి, వెంకట్, నాగరాజు, అరుణ, పవన్, సాయి, రాంగోపాల్, చిరంజీవి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో పూర్తయిన అభివృద్ధి పనులు



అమ్మవారి తోటల్లో నిర్మించిన షెడ్లు



పూర్తయిన కల్యాణ మండపం పనులు

- విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు రూ.1.50 కోట్లతో అంచనాలు
- ఆలయం వద్ద ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి చెందిన మునేరు అవతల మామిడి తోటల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మామిడి తోటల్లో రూ.3.75 కోట్లతో కల్యాణ మండపం, ఏసీ గదులు, రెండు మినీ ఫంక్షన్ హాల్స్, రూ.1.80 కోట్లతో నాలుగు మినీ ఫంక్షన్ హాల్స్, రెండు టాయిలెట్ బ్లాక్స్ నిర్మించారు. ఇవి కొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో భక్తులకు అందుబాటులోకి రానున్నాయి.

విద్యుత్ సౌకర్యానికి అంచనాలు

తోటల్లో పూర్తిస్థాయిలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఆలయ అధికారులు విద్యుత్ సౌకర్యం కోసం అంచనాలు తయారు చేస్తున్నారు. సుమారు రూ.1.50 కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, జనరేటర్, లైటింగ్, అలాగే మట్టితో చదును చేయటం, షాప్‌ల ఏర్పాటుకు అంచనాలు తయారు చేస్తున్నట్లు ఆలయ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

ఆలయం వద్ద ఆర్వో ప్లాంట్లు

ఆలయం వద్ద భక్తులకు స్వచ్ఛమైన జలాన్ని అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన డీవీస్ ల్యాబ్ వారు ముందుకు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సుమారు రూ.70 లక్షలతో ఆలయం లోపల రెండు, బయట రెండు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి కంపెనీ టెక్నీషియన్స్ వచ్చి సర్వీస్ చేస్తారన్నారు.

అన్ని వార్డుల్లో డ్రెయిన్ల నిర్మాణం చేస్తాం

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో అన్ని వార్డుల్లో డ్రెయిన్ల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలో శనివారం స్థానిక 31 వ వార్డు శాంతినగర్‌లో రూ.10 లక్షలతో చేపట్టిన డ్రైనేజ్ నిర్మాణ పనులకు మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే తాతయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య వ్యవస్థ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, 31 వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, పలు వార్డుల కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, పందుల రోశయ్య, నాయకులు మైనేని రాధ, చిరంజీవి, గద్దె నాని తదితరులు పాల్గొన్నారు.

నూర్జహాన్ దంపతులకు సత్కారం



నూర్జహాన్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీడీఓ సాయిహర్ష, ఏబీపీ మోహన్ సందీప్

పెనుగంచిప్రోలు: ఢిల్లీలోని ఎర్రకోటలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో పాల్గొని వచ్చిన మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన సయ్యద్ నూర్జహాన్ దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రానికి చెందిన 15 మంది లబ్ధిదారులను వివిధ పథకాలను వినియోగించుకున్నందుకు కేంద్రప్రభుత్వం స్వాతంత్ర్య దిన వేడుకలకు ఆహ్వానించింది. ఇందులో భాగంగా నూర్జహాన్ దంపతులను ఐసీడీఎస్ పోషకాహార కిట్స్ లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఢిల్లీ వెళ్లి వచ్చిన నూర్జహాన్ దంపతులను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ సాయిహర్ష జ్ఞాపికతో అభినందించారు. అనంతరం నూర్జహాన్ మాట్లాడుతూ ఢిల్లీ వెళ్లిన తమకు నీతి ఆయోగ్ సంస్థ వారి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఎర్రకోట వేడుకల్లో తమను భాగస్వామ్యం చేయటం మరచిపోలేని అనుభూతి ఇచ్చిందన్నారు. తమను ఎంపిక చేసిన ఎంపీడీఓ, ఏబీపీ కో-ఆర్డినేటర్ మోహన్ సందీప్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి, సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు.

పెనుగంచిప్రోలులో త్వరలో ఫైర్ స్టేషన్



జగ్గయ్యపేట ఫైర్ స్టేషన్‌ను సందర్శించిన రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ శ్రీనివాసులు

సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గానికి జగ్గయ్యపేట పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం మాత్రమే కాకుండా నియోజకవర్గంలోని మూడు మండలాలలో ఒకటైన పెనుగంచిప్రోలు మండలానికి కొత్తగా ఫైర్ స్టేషన్ రానుంది. ఈ మేరకు ఈనెల 16 వ తేదీన జగ్గయ్యపేట అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసులు జగ్గయ్యపేట నియోజకవర్గంలో వివిధ కర్మాగారాలు ఉన్నందున పేట నియోజకవర్గానికి అదనంగా మరొక ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా రానున్న ఫైర్ స్టేషన్‌ను పెనుగంచిప్రోలులో ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. జగ్గయ్యపేట పట్టణ ఫైర్ స్టేషన్‌కు మరొక మినీ ఫైర్ ఇంజన్‌ను మంజూరు చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. ఈ ఏడాది జూన్ 6 వ తేదీన పేటకు మరొక ఫైర్ స్టేషన్ అవసరం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితం అయింది. ఈ కథనానికి అగ్నిమాపక విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించారు. పర్యవసానంగా ఈ నెల 16వ తేదీ శుక్రవారం సాయంత్రం రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసులు జగ్గయ్యపేట ఫైర్ స్టేషన్‌ను సందర్శించారు. నియోజకవర్గానికి మరొక ఫైర్ స్టేషన్ అవసరత ఉందా లేదా అనే అంశంపై ఆరా తీశారు. నియోజకవర్గ పరిధి, వైశాల్యం, కర్మాగారాల గురించి స్థానిక ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తప్పకుండా త్వరలో మరొక ఫైర్ స్టేషన్‌ను మంజూరు చేస్తామని తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు, పెనుగంచిప్రోలు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు



శనీశ్వరునికి తైలాభిషేకం చేస్తున్న అర్చక స్వామి

నందిగామ టౌన్: నందిగామ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనిత్రయోదశిని శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే పుణ్యస్నానాలాచరించి ఆయా ఆలయాలలోని నవగ్రహాలకు భక్తులు తైలాభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని శనీశ్వర స్వామి వారి ఆలయం, రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, భాస్కరానందాశ్రమంలతో పాటు ఆయా ఆలయాలలోని నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి శనీశ్వరునికి తైలాభిషేకాలు నిర్వహించారు. మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి ఆలయాలలో శనీశ్వరునికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు చేశారు.